31వ వసంతంలోకి

# చురకలు

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల

ఆదివారం 29 మార్చి 2026 | పేజీలు : 8

## మూడు దశాబ్దాల నిబద్ధతకు ప్రతిఫలం

### జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా దినేష్



**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్**

జిల్లా రాజకీయాల్లో మౌనంగా పనిచేసే, కానీ ప్రభావవంతమైన నాయకత్వంతో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న సంగన భట్ల దినేష్ నియామకం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా జరగడం ఒక విధంగా ప్రజాసేవకు ఆయన చేసిన దీర్ఘకాల కృషికి లభించిన గౌరవంగా భావించవచ్చు. సాధారణ కుటుంబం నుంచి వచ్చిన ఆయన, క్రమంగా ప్రజా సమస్యలపై పట్టుదలతో ముందుకు సాగుతూ, రాజకీయ రంగంలో తనకంటూ ప్రత్యేక స్థానం ఏర్పరచుకున్నారు. గ్రామస్థాయి నాయకత్వం నుంచి జిల్లా స్థాయి బాధ్యతల వరకు ఎదిగిన ఆయన ప్రయాణం, నేటి యువ నాయకులకు ఒక ఆదర్శంగా నిలుస్తోంది. ప్రస్తుతం మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్న సంగన భట్ల దినేష్, పార్టీ వ్యవస్థలో క్రమశిక్షణ, నిబద్ధత, సమన్వయం అనే విలువలను ప్రతిష్ఠాత్మకంగా నిలబెట్టిన నాయకుడిగా గుర్తింపు పొందారు. ఆయన నాయకత్వంలో మండల స్థాయిలో కాంగ్రెస్ -2లో





## బస్తర్ అడవుల్లో

# బీటలు వారిన ఎర్ర కోటా !



### నేల కూలిన వందల మంది మావోలు
### వేలాది సంఖ్యలో సరెండర్
### దంతెవాడ జిల్లా నుండి సైనిక క్యాంపు ఎత్తివేత

**చురకలు ప్రత్యేక ప్రతినిధి :** తెలుగు నేలలో మదమెక్కిన గుండాలను,రౌడీ మూకలను గ్రామాల్లో భూస్వాముల నుంచి దొరల దౌర్జన్యాలు చేసిన వారిని గజ గజ వణికించిన అన్నల చరిత్ర ఇక మీదట పుస్తకాల్లో కనిపిస్తుంది.సమసమాజ స్థాపన కోసం ..దున్నే వాడికే భూమి,నూతన ప్రజాస్వామిక విప్లవం సాధన ద్వారా ప్రజల విముక్తి ఆకాంక్ష ఇవి అన్నలు సాధిస్తా మన్నా ఆశయాలు నెరవేరుతాయి అని 50 ఏళ్ల పాటు పోరాడి అలసి పోయారు.మైదాన ప్రాంతాల్లో తిరుగు లేని విధంగా సమాంతర -2లో



## పెనం నుంచి
# పొయ్యిలోకి?



**-జీవన్ రెడ్డి రాజకీయ ప్రయాణం కొత్త మలుపు**
**-కాంగ్రెస్ అవమానం నుంచి.. బీఆర్ఎస్ ఆశ్రయం**
**-ఇది పరిష్కారమా? లేక మరింత సవాలా?**

**(కాలగిరి శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ జర్నలిస్ట్)**

తెలంగాణ రాజకీయాల్లో ఒక వాడివేడి చర్చ మొదలైంది. ఇది కేవలం పార్టీ మార్పు కథ కాదు, ఒక నాయకుడి రాజకీయ వ్యక్తిత్వం, నమ్మకాలు, భవిష్యత్తు అన్ని ఒకేసారి పరీక్షకు గురైన సందర్భం. జీవన్ రెడ్డి నిర్ణయం “పెనం నుంచి పొయ్యి లోకి?” పడేశారా అన్న సందేహాన్ని రేకెత్తించేలా తాటిపర్తి జీవన్ రెడ్డి తీసుకున్న ఈ నిర్ణయం ఇప్పుడు రాజకీయ వర్గాల్లోనే కాదు, సామాన్య ప్రజల్లో కూడా పెద్ద చర్చనీ యాంశమైంది. కాంగ్రెస్‌లో అవమానాన్ని ఎదుర్కొన్న నాయకుడు, అదే సమయంలో గతంలో తీవ్రంగా విమర్శించిన బీఆర్ఎస్ వైపు అడుగు వేయడం.. ఇది వ్యూహాత్మక మార్పా? లేక ఆత్మగౌరవ పోరాటమా? అన్న ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. కేసీఆర్ కేంద్రీకృత నాయకత్వంలో జీవన్ రెడ్డి ఇమడగలరా? లేక ఇది మరో కొత్త సవాలుకు నాంది అవుతుందా? అన్న ఉత్కంఠతో తెలంగాణ రాజకీయాలు ఇప్పుడు ఒక కీలక మలుపు వద్ద నిలిచాయి.జగిత్యాల జిల్లా లక్ష్మీపూర్‌లో ఏప్రిల్ 10న భారీ బహిరంగ సభ ఏర్పాట్లు జరుగుతున్నాయి. 15 ఎకరాల విస్తీర్ణంలో పెద్ద స్థాయిలో సన్నాహాలు చేస్తున్నారు. మాజీ -2లో

## ఆర్టీసీ సమస్యలపై ప్రజా ప్రతినిధుల ముఖాముఖి సమావేశం



**-అధికారులు సమన్వయం చేసుకుంటూ సంస్థకు మంచిపేరు తేవాలి..**
**-అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు - మంత్రి పొన్నం ప్రభాకర్**

చురకలు ప్రతినిధి కరీంనగర్ మార్చ్ 28 : మహా లక్ష్మీ పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయా ణికుల సంఖ్య పెరుగుతుండడంతో నియోజక వర్గాల వారిగా కావాల్సిన మౌలిక సదుపాయాలు, కొత్త బస్సులు, -2లో

## ఆర్టీసీ సమస్యలపై ....

**మొదటి పేజీ తరువాయి...**బస్ స్టేషన్ ల అభివృద్ధి , కొత్త రూట్లు, బస్ డిపోల అవసరాల పై మూడు రోజులుగా ఉమ్మడి జిల్లాల ప్రజా ప్రతినిధులతో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్టీసీ అధికారులతో కలిసి ముఖాముఖి సమావేశాలు నిర్వహిస్తున్నారు. మూడవ రోజు అదిలాబాద్ , కరీంనగర్ , ఖమ్మం జిల్లా ప్రజా ప్రతినిధులతో అసెంబ్లీ కమిటీ హాల్ -1 లో సమావేశాన్ని ఏర్పాటు చేశారు..చెన్నూరు నియోజకవర్గంలో బస్ స్టేషన్ అభివృద్ధి తో పాటు కొత్త రూట్ లలో బస్సులు నడిపించాలని మంత్రి వివేక్ వెంకట్ స్వామి సూచించారు. సింగరేణి ఏరియా లో కార్మికులకు ఇబ్బందులు లేకుండా గతంలో నడిచిన రూట్లతో పాటు అదనపు రూట్ లలో నడిపించాలని కోరారు.కోరుట్ల నియోజకవర్గంలో మెట్పల్లి, కోరుట్ల బస్ స్టేషన్ లను అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే డా,, సంజయ్ కుమార్ మంత్రి పొన్నం ప్రభాకర్ కి విజ్ఞప్తి చేశారు. మొగిలిపేట ప్రధాన రహదారి పై బస్సులు ఆగేలా చూడాలని కోరారు. మండలాల వారిగా హైదరాబాద్ కి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలని కోరారు.

## మూడు దశాబ్దాల నిబద్ధతకు ప్రతిఫలం

**మొదటి పేజీ తరువాయి...**పార్టీ కార్యకలాపాలు మరింత చురుకుగా సాగాయి. పార్టీ సిద్ధాంతాలను గ్రామీణ స్థాయికి తీసుకెళ్లడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. ప్రతి కార్యకర్తను తన కుటుంబ సభ్యుడిలా భావిస్తూ, వారికి ప్రోత్సాహం ఇవ్వడం ఆయన ప్రత్యేక లక్షణం.గతంలో ధర్మపురి ఎంపీటీసీగా పనిచేసిన సమయంలోనే ఆయన ప్రజా సమస్యలపై లోతైన అవగాహనను పెంపొందించు కున్నారు. గ్రామీణ అభివృద్ధి, మౌలిక సదుపాయాల విస్తరణ, పేదల సంక్షేమం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి, స్థానిక ప్రజల విశ్వాసాన్ని గెలుచుకున్నారు. ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో, వాటి పరిష్కారానికి కృషి చేయడంలో ఆయన చురుకైన పాత్ర పోషించారు. ఎంపీటీసీగా ఉన్నప్పుడే ఆయన ప్రజల మధ్య విశ్వసనీయ నాయకుడిగా ఎదిగారు.దివంగత మంత్రి జువ్వాడి రత్నాకర్ రావు అనుచరుడిగా సంగన భట్ల దినేష్ రాజకీయంగా మరింత పరిపక్వత సాధించారు. రత్నాకర్ రావు సాన్నిధ్యంలో ఆయన రాజకీయ దిశ, దృక్పథం మరింత బలపడింది. నాయకత్వం అంటే కేవలం అధికారంలో ఉండటం కాదు, ప్రజలకు సేవ చేయడం అనే భావనను ఆయన గురువు ద్వారా నేర్చుకున్నారు. అదే మార్గంలో నడుస్తూ, తన రాజకీయ జీవితాన్ని ప్రజా సేవకు అంకితం చేశారు.ధర్మపురి దేవస్థానం చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించిన సమయంలో ఆయన చూపిన పరిపాలనా నైపుణ్యం ప్రత్యేకంగా ప్రస్తావించదగినది. దేవస్థాన అభివృద్ధికి ఆయన తీసుకున్న చర్యలు భక్తుల ప్రశంసలను అందుకున్నాయి. ఆలయ పరిసరాల అభివృద్ధి, సదుపాయాల విస్తరణ, పారదర్శక పరిపాలన వంటి అంశాల్లో ఆయన చేసిన కృషి స్పష్టంగా కనిపించింది. భక్తులకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించడంలో ఆయన చూపిన కట్టుబాటు, ఆయన పరిపాలనా సామర్థ్యాన్ని ప్రతిబింబిస్తుంది. మూడు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీని వీడకుండానే కొనసాగుతున్న ఆయన రాజకీయ ప్రయాణం, నేటి రాజకీయ పరిస్థితుల్లో అరుదైన ఉదాహరణగా చెప్పవచ్చు.

# బస్తర్ అడవుల్లో బీటలు వారిన ఎర్ర కోటా!

**మొదటి పేజీ తరువాయి...** ప్రభుత్వం నడిపిన మావోయిస్టులు 1984 లో ఎర్ర సైన్యం ఏర్పాటు కోసం బస్తార్ వెళ్లిన తరువాత ఏకంగా అడవిని ఎర్రకోటగా మార్చేశారు.జల్ జంగిల్ జమీన్ పేరుతో జనతన రాజ్యం ఏర్పాటు చేశారు.. ఇప్పుడు ఇదంతా గతం,నేడు నక్సల్స్ రహిత జిల్లాలు,రాష్ట్రాలుగా మారి పోతున్నాయి.ఒక్కో జిల్లాకు వేల సంఖ్యలో కనిపించిన మావోలు దంతెవాడ జిల్లాలో మావోయిస్టుల కదలికలు మాయం.కాంకేర్ జిల్లాలో 19 మంది మావోయిస్టులు,బీజాపూర్ జిల్లా లో 11 మంది,సుక్మాలో నలుగురు ఉన్నారు.నారాయణ పూర్లో కూడా ఇద్దరే ఉన్నారు. వీరిలో అడవి అంతా లెక్కిస్తే 38 మందికి మాత్రమే చేరుకున్నది.తూర్పు,పశ్చిమ బస్తర్ ఖాళీ అలాగే కొండగాం జిల్లాలో ఉన్న జాడలేదు.అందులో డి కె ఎచ్ జడ్ సి స్థాయి కమాండర్లందరూ హతం, అగ్ర నాయకత్వం పూర్తిగా ధ్వంసం బస్తర్‌లోని 1000 గ్రామాల్లో 96% ప్రాంతం ఇప్పుడు నక్సల్స్ ముక్త; దంతెవాడ నుంచి తొలి పోలీస్ క్యాంపు తొలగింపుజరిగి పోయింది .

బస్తర్‌లో నక్సలిజానికి వ్యతిరేకంగా జరుగుతున్న నిర్ణయాత్మక పోరాటం ఇప్పుడు చివరి దశకు చేరుకున్నట్లు కనిపిస్తోంది. భద్రతా దళాల నిరంతర ఆపరేషన్లు, లొంగుబాట్లు మరియు వ్యూహాత్మక ఒత్తిడి కారణంగా నక్సల్స్ సంస్థ వెన్నుముక విరిగింది. తాజా పరిస్థితుల్లో ఇప్పుడు (దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ) స్థాయి లేదా అంతకంటే పైన ఉన్న పెద్ద కమాండర్లు ఎవరూ సజీవంగా లేరు. బస్తర్, కొండగావ్ జిల్లాలు పూర్తిగా నక్సల్ రహితంగా మారగా, దంతెవాడ, నారాయణపూర్ మరియు సుక్మా జిల్లాల్లో వేళ్లమీద లెక్కించదగ్గ నక్సలైట్లు మాత్రమే మిగిలారు.

అదేవిధంగా కాంకేర్ మరియు బీజాపూర్‌లో కూడా నక్సలైట్ల సంఖ్య పదుల అంకెకు పడిపోయింది. ప్రస్తుతం బస్తర్‌లో డీకేఎస్ జడ్ సీ స్థాయి కమాండర్లు పూర్తిగా తుడిచిపెట్టుకుపోవడం విశేషం. కొందరు లొంగిపోగా, మరికొందరిని భద్రతా దళాలు మట్టుబెట్టాయి. నక్సల్ సంస్థ యొక్క అగ్ర నిర్మాణం పూర్తిగా కుప్పకూలిపోయింది. దీని ప్రభావంతో నక్సలైట్లతో పోరాడటానికి ఏర్పాటు చేసిన పోలీస్ క్యాంపులను (పారామిలిటరీ దళాలు ఉన్నవి) ఇప్పుడు మూసివేస్తున్నారు. దంతెవాడ జిల్లాలోని కటే కల్యాణ్ రోడ్డుపై నక్సల్స్‌ను నియంత్రించడానికి ఏర్పాటు చేసిన లి'జారమ్ క్యాంపు'ను తొలగించారు. ఈ ప్రాంతం నక్సల్స్ యొక్క కటే కల్యాణ్ ఏరియా కమిటీ పరిధిలోకి వచ్చేది మరియు అబూజ్మాడ్ ప్రాంతానికి నక్సలైట్లకు అవసరమైన సరుకుల సరఫరా ఇక్కడి నుంచే జరిగేది. కానీ ఇప్పుడు పరిస్థితులు మారడంతో జారమ్ క్యాంపు నుంచి బలగాలను ఉపసంహరించుకున్నారు. ఇదే తరహాలో సుక్మా మరియు ఇతర జిల్లాల నుండి కూడా క్యాంపులను తొలగించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. రాష్ట్ర హోం మంత్రి విజయ్ శర్మ మాట్లాడుతూ.. క్యాంపులను తొలగించి అక్కడ గిరిజనుల కోసం లి'సువిధా కేంద్రాల'లిలిను (సౌకర్య కేంద్రాలు) ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రస్తుతం బస్తర్ మొత్తంలో ఒక్క డికె ఎస్ జడ్ ఎస్ సి స్థాయి నక్సలైట్ కూడా మిగిలి లేరని ఆయన స్పష్టం చేశారు.

జారమ్ క్యాంపు నుంచి బలగాల ఉపసంహరణ;

అక్కడ గిరిజనుల కోసం సౌకర్య కేంద్రాల ఏర్పాటు చేస్తున్నారు.

గత ఏడాది కాలంగా ఈ గ్రామాల్లో ఎలాంటి నక్సల్ కార్యకలాపాలు లేవు తాజా గణాంకాల ప్రకారం, బస్తర్ డివిజన్‌లోని సుమారు 96% ప్రాంతం ఇప్పుడు నక్సల్ ప్రభావం నుండి విముక్తి పొందింది. మిగిలిన ప్రాంతాల్లో కూడా నక్సలైట్లు చిన్న చిన్న బృందాలకే పరిమితమయ్యారు. బస్తర్ డివిజన్‌లోని 7 జిల్లాల్లో ఉన్న 1100 గ్రామాల్లో సుమారు 1000 గ్రామాల్లో గత ఏడాది కాలంగా ఎలాంటి నక్సల్ కార్యకలాపాలు నమోదు కాలేదు.

సుక్మా, బీజాపూర్ మరియు తెలంగాణ సరిహద్దు గ్రామాల్లో మాత్రమే నక్సలైట్ల కదలికలు ఉన్నట్లు ధృవీకరించబడని వార్తలు ఉన్నాయి. మార్చి 31 డెడ్‌లైన్ ముగిసిన తర్వాత, ఈ గ్రామాలను విడతల వారీగా లేదా ఒకేసారి 'నక్సల్ ముక్త' గ్రామాలుగా ప్రకటించే అవకాశం ఉంది. ప్రభుత్వ ప్రణాళిక ప్రకారం, నక్సల్ రహితంగా ప్రకటించబడే గ్రామాలకు అభివృద్ధి పనుల కోసం ఒక కోటి రూపాయల నిధిని అందజేస్తారు.

'జంతానా సర్కార్' అంతం;

గ్రామాలపై పట్టు సాధించిన యంత్రాంగం.!

నక్సలైట్ల యొక్క 'జంతానా సర్కార్' (సమాంతర ప్రభుత్వం) ఇప్పుడు పూర్తిగా ధ్వంసమైంది. ఒకప్పుడు వారి ఆధిపత్యం నడిచిన ప్రాంతాల్లో ఇప్పుడు ప్రభుత్వ యంత్రాంగం నేరుగా చేరుకోగలుగుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, ఆరోగ్యం, విద్య మరియు ఉపాధి పనుల విస్తరణ స్థానిక ప్రజల్లో నమ్మకాన్ని పెంచింది.

లొంగుబాట్ల వెల్లువ: 2,600 మందికి పైగా నక్సలైట్ల ఆయుధ త్యాగం జనవరి 2024 నుండి ఇప్పటివరకు 2,600 మందికి పైగా నక్సలైట్లు లొంగిపోయారు. ఇటీవలి సామూహిక లొంగుబాట్లలో వందలాది మంది ఆయుధాలు వదలడం నక్సల్ సంస్థకు పెద్ద దెబ్బగా మారింది. అగ్రశ్రేణి క్యాడర్లు కూడా ఇప్పుడు సంస్థను వీడుతున్నారని ఇది నిరూపిస్తోంది.

అంచనా: డివిజన్ మొత్తం మీద మిగిలి ఉన్నది 38 మంది నక్సలైట్లు మాత్రమే భద్రతా సంస్థల అంచనా ప్రకారం, ప్రస్తుతం కేవలం 38 మంది క్రియాశీల నక్సలైట్లు మాత్రమే మిగిలారు, వారు కూడా తీవ్ర ఒత్తిడిలో ఉండి లొంగిపోయే దిశగా ఆలోచిస్తున్నారు. డివిజన్‌లోని ఏడు జిల్లాల్లో అత్యధికంగా కాంకేర్ జిల్లాలో 19 మంది ఉండగా, అత్యల్పంగా దంతెవాడలో కేవలం ఒక్కరు (01) మాత్రమే మిగిలారు. ఆ ఏ సి ఎం క్యాడర్ వ్యక్తి కూడా సుక్మా వైపు పారిపోయినట్లు సమాచారం. దంతెవాడ జిల్లాలో ఇప్పుడు సమస్యాత్మక లేదా అతి సమస్యాత్మక గ్రామం ఒక్కటి కూడా మిగిలి లేదు. జిల్లాల వారీగా నక్సలైట్ల సంఖ్యఅతి స్వల్పం.

# పెనం నుంచి...

**మొదటి పేజీ తరువాయి....**మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీకి 40-42 ఏళ్ల సేవ చేసి ఇటీవల రాజీనామా చేశారు. ఇప్పుడు బీఆర్ఎస్‌లో చేరనున్నారు. కేసీఆర్ సమక్షంలో సభ జరగనుంది. కేటీఆర్, హరీష్ రావు సభా స్థలం పరిశీలించనున్నారు. ఈ పరిణామం తెలంగాణ రాజకీయాల్లో పెద్ద చర్చనీయాంశంగా మారింది.ప్రజలు, కార్యకర్తలు, అనుచరుల మనసులో ఒక్క ప్రశ్న మాత్రం వెంటాడుతుంది. కేసీఆర్ వైఖరిని జీవన్ రెడ్డి తట్టుకోగలరా? గతంలో ఫిరాయింపులను తీవ్రంగా వ్యతిరేకించిన నాయకుడిగా, ప్రజాస్వామ్యానికి వ్యతిరేకమని విమర్శించిన వ్యక్తిగా ఆయనకు ఒక ప్రత్యేకమైన ఇమేజ్ ఉంది. ఇప్పుడు అదే విమర్శలు ఎదుర్కొన్న పార్టీలో చేరడం సహజంగానే సందేహాలకు దారి తీస్తోంది. రాజకీయాల్లో పరిస్థితులు మారుతాయి. కానీ సూత్రాలు కూడా అంతే వేగంగా మారాలా అన్నది ప్రజల మనసులో ఉన్న అసలు సందేహం.జీవన్ రెడ్డి నిర్ణయం వెనుక వ్యక్తిగత, రాజకీయ కారణాలు కలగలిపి ఉన్నాయి. కాంగ్రెస్‌లో ఆయన దశాబ్దాల పాటు సేవ చేసి, జగిత్యాలలో బలమైన నాయకుడిగా ఎదిగారు. ఆరు సార్లు ఎమ్మెల్యేగా గెలవడం, మంత్రి పదవి చేపట్టడం, ఎమ్మెల్సీగా విజయం సాధించడం అన్ని ఇవి ఆయన రాజకీయ స్థాయిని తెలియజేస్తాయి. కానీ 2018, 2023 ఎన్నికల్లో ఎదురైన పరాజయాలు, ముఖ్యంగా తన ప్రత్యర్థి సంజయ్ కుమార్‌ను కాంగ్రెస్‌లోకి తీసుకోవడం ఆయనకు తీవ్ర అవమానంగా అనిపించింది. తన అభిప్రాయాన్ని పట్టించుకోకుండా తీసుకున్న ఆ నిర్ణయం ఆయనలో అసంతృప్తిని పెంచింది. రేవంత్ రెడ్డి నాయకత్వంపై కూడా అదే సమయంలో అనుమానాలు, అసంతృప్తి పెరిగాయి. చివరికి ఆ అసంతృప్తి రాజీనామాగా, ఇప్పుడు పార్టీ మార్పుగా మారింది. ఇప్పుడు ఆయన అడుగుపెడుతున్న బీఆర్ఎస్ పార్టీ గురించి మాట్లాడితే, అది పూర్తిగా కేసీఆర్ కేంద్రీకృత నాయకత్వంతో నడిచే పార్టీ అన్న భావన బలంగా ఉంది. నిర్ణయాలు ఎక్కువగా ఒకే కేంద్రంలో ఉండటం, సీనియర్ నాయకులకు పరిమిత స్వేచ్ఛ ఉండటం, కుటుంబ ప్రభావం ఉండటం వంటి విమర్శలు గతంలో ఎన్నోసార్లు వినిపించాయి. ఈటెల రాజేందర్ వంటి సీనియర్ నాయకుడు పార్టీని వీడటానికి కారణం కూడా ఇదేనని అప్పట్లో చర్చ జరిగింది. ఇలాంటి పరిస్థితుల్లో స్వతంత్ర అభిప్రాయాలు కలిగిన జీవన్ రెడ్డి అక్కడ ఎలా సర్దుకుంటారు అన్నది ఒక కీలక ప్రశ్నగా మారింది.ఇక్కడే ప్రధాన విరుద్ధత స్పష్టంగా కనిపిస్తోంది. గతంలో ఫిరాయింపులను తీవ్రంగా వ్యతిరేకించిన నాయకుడు ఇప్పుడు అదే విమర్శలు ఎదుర్కొన్న పార్టీలో చేరడం ప్రజల్లో నమ్మకంపై సందేహం కలిగిస్తోంది. అయితే రాజకీయాల్లో ఇది పూర్తిగా కొత్త విషయం కాదు. చాలా మంది నాయకులు పరిస్థితులకు అనుగుణంగా తమ నిర్ణయాలను మార్చుకున్నారు. కానీ ప్రతి మార్పు ఒక నాయకుడి విశ్వసనీయతను పరీక్షిస్తుంది. జీవన్ రెడ్డి విషయంలో కూడా అదే జరుగుతోంది.సామాజిక మాధ్యమాల్లో ఈ అంశంపై విస్తృత చర్చ జరుగుతోంది. కొందరు దీనిని కాంగ్రెస్ వైఫల్యంగా చూపిస్తుంటే, మరికొందరు జీవన్ రెడ్డి నిర్ణయాన్ని విమర్శిస్తున్నారు. ఫిరాయింపులను వ్యతిరేకించిన వ్యక్తి తానే ఇప్పుడు అదే మార్గాన్ని ఎంచుకోవడం ఎంతవరకు సమర్థనీయం అన్న ప్రశ్నలు వస్తున్నాయి. మరోవైపు, కొందరు దీనిని రాజకీయ వ్యూహంగా చూస్తూ, ఆయన భవిష్యత్ అవకాశాల కోసం తీసుకున్న నిర్ణయంగా భావిస్తున్నారు. ఈ విభిన్న అభిప్రాయాలు ప్రజల్లో ఉన్న గందరగోళాన్ని స్పష్టంగా చూపిస్తున్నాయి.జీవన్ రెడ్డికి జగిత్యాలలో ఉన్న స్థానిక బలం, అనుభవం బీఆర్ఎస్‌కు కొంతవరకు లాభం కలిగించవచ్చు. కానీ అదే సమయంలో కేసీఆర్ నాయకత్వ శైలి, పార్టీలో ఆయనకు లభించే స్థానం, భవిష్యత్ టికెట్ అవకాశాలు అన్ని ఇవి ఆయన రాజకీయ భవిష్యత్తును నిర్ణయించబోతున్న అంశాలు. గతంలో చాలా మంది నాయకులు కొత్త పార్టీలో ఆశించిన స్థాయిలో స్థిరపడలేకపోయిన ఉదాహరణలు ఉన్నాయి. అదే పరిస్థితి ఇక్కడ కూడా వస్తుందా అన్నది చూడాలి.స్థానిక బీఆర్ఎస్‌లో అంగీకారం దక్కుతుందా? లేక అంతర్గత విభేదాలే సవాలా?

ఇదే సందర్భంలో మరో కీలకమైన కోణం కూడా పరిశీలించాల్సి ఉంది. బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేగా ఉండి కాంగ్రెస్‌లో సంజయ్ కుమార్ అనధికారికంగా ప్రవేశించి నియోజకవర్గంలో రాజకీయ కార్యక్రమాలు నిర్వహించినప్పుడు స్థానిక నాయకత్వంలో ఏర్పడిన అసంతృప్తి ఇంకా అందరికీ గుర్తుండగానే ఉంది. అదే పరిస్థితి ఇప్పుడు బీఆర్ఎస్‌లో పునరావృతమయ్యే అవకాశాన్ని కొట్టిపారేయలేము. జీవన్ రెడ్డి వంటి బలమైన స్థానిక నాయకుడు అకస్మాత్తుగా పార్టీలో చేరితే, ఇప్పటికే ఆ నియోజకవర్గంలో సంవత్సరాలుగా పనిచేస్తూ టికెట్ ఆశిస్తున్న బీఆర్ఎస్ నాయకులు తమ రాజకీయ భవిష్యత్తుపై అనిశ్చితిలో పడే అవకాశం ఉంది. బయటకు ఆయనకు స్వాగతం పలికినా, లోపల మాత్రం "మా అవకాశాలు తగ్గిపోతున్నాయా?" అనే భావన పెరిగితే అది భవిష్యత్తులో అంతర్గత విభేదాలకు దారి తీసే ప్రమాదం ఉంది. ముఖ్యంగా టికెట్ కేటాయింపుల సమయంలో ఈ అసంతృప్తి స్పష్టంగా బయటపడే అవకాశం ఉంటుంది. రాజకీయాల్లో అనేకసార్లు కనిపించినట్లుగా, పైకి ఐక్యత కనిపించినా, లోపల వ్యతిరేక ధోరణులు కొనసాగడం సహజం. జీవన్ రెడ్డి చేరికను కొంతమంది స్థానిక నాయకులు పార్టీ బలపడే అవకాశంగా చూస్తే, మరికొందరు తమ స్థానాన్ని కోల్పోతామన్న భయంతో దూరంగా ఉండవచ్చు. ఇదే పరిస్థితి కొనసాగితే ఆయనకు పూర్తి స్థాయి మద్దతు దక్కకపోవడం, లేదా పరోక్షంగా వ్యతిరేకత ఎదురుకావడం కూడా సంభవించవచ్చు. కాబట్టి జీవన్ రెడ్డి రాజకీయ భవిష్యత్తు కేవలం కేసీఆర్ నాయకత్వాన్ని తట్టుకోవడంపైనే కాకుండా, స్థానిక బీఆర్ఎస్ నాయకత్వంతో సమన్వయం సాధించగల సామర్థ్యంపై కూడా ఆధారపడి ఉంటుంది.

ఈ నిర్ణయం తక్షణ ప్రయోజనాల కోసం మాత్రమే కాకుండా భవిష్యత్ రాజకీయ గణితాన్ని దృష్టిలో పెట్టుకుని తీసుకున్నదిగా కనిపిస్తోంది. 2028 ఎన్నికల దిశగా బీఆర్ఎస్ తన బలం పెంచుకునే ప్రయత్నంలో ఉంది. ఆ ప్రక్రియలో జీవన్ రెడ్డి వంటి సీనియర్ నాయకుడు కీలక పాత్ర పోషించవచ్చు. కానీ ఆ పాత్ర ఎంతకాలం కొనసాగుతుంది, ఆయనకు ఎంత ప్రాధాన్యం లభిస్తుంది అన్నది భవిష్యత్తులో తేలాల్సిన అంశం.చివరగా చెప్పాలంటే, ఇది కేవలం ఒక పార్టీ మార్పు కాదు.. ఇది ఒక రాజకీయ పరీక్ష. జీవన్ రెడ్డి తన నిర్ణయంతో కొత్త అవకాశాలను సృష్టించుకుంటారా? లేక తన ఇమేజ్‌ను కోల్పోతారా? అన్నది ఇప్పుడు పెద్ద ప్రశ్న. ప్రజలు ఇప్పుడు మరింత అవగాహనతో ఉన్నారు. వారు మాటలు కాదు.. చర్యలను గమనిస్తున్నారు. కేసీఆర్ నాయకత్వంలో ఆయన తన స్థానం నిలబెట్టుకుంటారా? లేక మళ్లీ అసంతృప్తి ఎదుర్కొంటారా? అన్నది కాలమే నిర్ణయిస్తుంది.

ఒక విషయం మాత్రం ఖాయం.. ఇది కేవలం ఒక పార్టీ మార్పు కాదు... ఇది తెలంగాణ రాజకీయాల్లో "సూత్రాలు వర్సెస్ అవకాశాలు" మధ్య జరుగుతున్న పెద్ద పోరాటం. జనం చూస్తున్నారు... తీర్పు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారు.

# గడి బురుజుల రక్షణకు కోరుట్ల అఖిలపక్షాల పిలుపు

**చురకలు ప్రతినిధి, కోరుట్ల, మార్చి 28 :** కోరుట్ల పట్టణంలోని సి. ప్రభాకర్ స్మారక గ్రంథాలయ భవనంలో శనివారం అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. పట్టణంలోని పురాతన గడి పరివాహక భూముల పరిరక్షణ అంశంపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించారు.కొన్ని వర్గాలు మున్సిపాలిటీ ద్వారా అనుమతులు పొందినట్లు సమాచారం రావడంతో, ప్రజల పక్షాన అఖిలపక్ష కమిటీ ఈ అంశాన్ని గంభీరంగా పరిశీలించింది.ఈ సందర్భంగా కోరుట్లలోని గడి బురుజు గ్రామకంఠ స్థలంగా ఉన్న సుమారు 3 ఎకరాలు 21 గుంటల భూమి అక్రమ కబ్జాకు గురవుతున్నదని నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ భూమిని



రక్షించడం కోరుట్ల ప్రజలందరి బాధ్యత అని వారు స్పష్టం చేశారు.తదుపరి కార్యాచరణలో భాగంగా, మార్చి 30, 2026 సోమవారం గడి బురుజుల వద్ద అఖిలపక్షాల ఆధ్వర్యంలో భారీ స్థాయిలో జన సమీకరణ కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించారు. భూముల పరిరక్షణ కోసం ఉద్యమాన్ని మరింత బలపరచాలని,అవసరమైతే చట్టబద్ధంగా కోర్టులో కేసులు వేయాలని కూడా నిర్ణయించారు.ఈ కార్యక్రమానికి కోరుట్ల పట్టణ ప్రజలు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజాసంఘాల ప్రతినిధులు, మేధావులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని అఖిలపక్ష నాయకులు పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి చెన్న విశ్వనాథం, సిపిఎం పట్టణ కార్యదర్శి కె. శంకర్, న్యూ డెమోక్రసీ నేత చింత భూమేశ్వర్, ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు, ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు పేట భాస్కర్, సమాజ్‌వాది పార్టీ రాష్ట్రకార్యదర్శి ఎం.డి. ముజాహిద్, ఎంఐఎం పట్టణ అధ్యక్షుడు ఎం.డి. రఫీ, ధర్మ సమాజ్ పార్టీ నాయకుడు బొబ్బిలి కిషోర్, తెలుగుదేశం పార్టీ నాయకులు తుమ్మనపల్లి శ్రీనివాస్ బాబు,సీనియర్ నాయకుడు పోతని సత్యం,మాస్తిన్ సంఘ సభ్యుడు గుత్తుల గంగ నరసయ్యతదితరులు పాల్గొన్నారు.

# గోదుర్ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

**-కొలిచినవారికి కొంగు బంగారంగా నిలుస్తున్న వెంకటేశ్వరస్వామి**

**-బినేటీ మొదలు మూడు రోజులపాటు బ్రహ్మోత్సవాలు**

**-42వ వార్షికోత్సవ ఉత్సవ ఎర్పాటులో ఆలయ కమిటీ సభ్యులు**







**చురకలు విలేకరి ఇబ్రహింపట్నం మార్చి (28) :** దాదాపు 42సంవత్సరాల నాటి ఆలయాలలో శ్రీలక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయం ఒకటిగా ప్రసిద్ధి చెందింది.ఆలయం శ్రీలక్ష్మి వెంకటేశ్వర స్వామివారి మూలవిరాట్ ముడుమిటర్ల పోడవుతోపాటు స్వామి వారి కుడి భాగాన గోదాదేవి అమ్మవారి రెండుమిటర్ల, స్వామివారి ఎడమ భాగాన రామనుజులవారి రాతి విగ్రహాలు కొలువుదీరి ఉన్నాయి.ఈ ఆలయంలో 12మంది ఆళ్వారులు, సాలగ్రామాలు,గర్భాలయం పైన పద్మవ్యూహం తో రాతితో చెక్కబడ్డాయి. వివరాల్లోకి వెళితే జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని గోదుర్ గ్రామానికి చెందిన ఆలయం శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయం చెరువు తిరన ఉంది ఈ ఆలయం ప్రతి సవత్సరం వార్షికంగా మార్చి నెలలో దేవాలయ కమిటీ,గ్రామాభివృద్ధి కమిటీ గ్రామ ప్రజల సహాయ సహకారాలతో ఉత్సవాలు జరుగుతాయి.కొన్ని సంవత్సరాలుగా యజ్ఞార్చకులు చక్రపాణి మాదవచార్యులు,డింగిరి లక్ష్మణమూర్తి చార్యులుచేతుల మిదుగా ఆలయంలో స్వామివారికి అభిషేకాలు, యజ్ఞము,ఆలయ బలిహరణం కళ్యాణ మహోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తారు .ఈ ఆలయ ప్రాంగణంలో నవగ్రహ మండపం,యజ్ఞ మండపము,కళ్యాణ మండపము,తులసి కోట, శివపార్వతుల ప్రతిరూపమైన రావి,వేప,ఉసిరి చెట్లు భక్తుల పుజలు అందుకుంటున్నాయి. ఈ ఆలయానికి కోరిన కోరికలు తీర్చే దేవుడిగా ప్రసిద్ధి చెంది ఉమ్మడి కరీంనగర్ ,ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల నుండి బ్రహ్మోత్సవాలకు వేలాది సంఖ్యలో భక్తులు తరలి వస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలను ఆలయ కమిటీ,గ్రామాభివృద్ధి కమిటీల ఆధ్వర్యం లో ఉత్సవాలకు ఎర్పాట్లు పుర్తిచేసి భక్తులకు అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసి బ్రహోత్సవాలకు సిద్ధంగా చేశారు.

**బ్రహ్మోత్సవాల్లో భాగంగా రోజువారీ కార్యక్రమాలు ఇలా ఉన్నాయి:-**

29/03/ 2026 అదివారం రోజున ఉదయం ఎనిమిది గంటలకు ఆలయం లో గోదావరి జలాలతో అభిషేకాలు అనంతరం నిత్యవిధి ఆరాధనం,స్వస్తి వాచనం,దేవతామూర్తుల స్థాపనలు, అగ్ని ప్రతిష్ట,హోమము,ధ్వజారోహణం, గరుడపెల్లి,ఆలయ బలిహరణం అనతరం నిథ్యవిది కార్యక్ర మాలు 30/03/2026 సోమవారం రోజున ఉదయం ఎనిమిది గంటలకు ఆలయంలో గోదావరి జలాలతో అభిషేకాలు,స్వామి వారి ములవిరాఠ్ కు పులభిషెకం అనంతరం నిత్యవిధి ఆరాధనం,స్వస్తి వాచనం, దేవతా మూర్తుల స్థాపనలు, హోమము,నిత్య పూర్ణాహుతి ,అనంతరం కల్యాణ మండపంలో అలివేలు మంగమ్మ,పద్మావతి శ్రీలక్ష్మి వెంకటేశ్వర స్వామి వారికీ అర్చకులు చేతుల మీదుగా కళ్యాణం జరిపీచబడుతుంది. బలిహరణం, అనంతరం ఆలయ నిత్యవిది కార్యక్రమాలు,భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం. 31/03/2026 మంగళవారం ఉదయం ఎనిమిది గంటలకు గోదావరి జలలు, పంచామృత అభిషేకాలు స్వామి వారికీ నిర్వహించిన అనంతరం, నిత్యస్వస్తి వచనం,యజ్ఞము పూర్ణాహుతి కార్యక్రమం అనంతరం వెంకటేశ్వర స్వామి అలివేలుమంగా పద్మావతి అమ్మవారు గ్రామ ప్రదక్షణ ఎదుర్కోలు మహోత్సవం,రాత్రికి స్వామివారి రథము గ్రామంలో ఊరేగింపు ప్రదక్షిణ, అనంతరం అర్చకులకు పండితులకు సన్మాన మహోత్సవ కార్యక్రమం జరుగనుంది.



# గ్యాస్, పెట్రోలియం కొరత లేదు...వదంతులు నమ్మవద్దు

**-జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి జితేందర్ రెడ్డి**

**చురకలు ప్రతినిధి, జగిత్యాల, మార్చి 28 :** జిల్లాలో ఎల్‌పిజి గ్యాస్, పెట్రోలియం, డిజిల్ ఉత్పత్తులకు ఎటువంటి కొరత లేదని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి జితేందర్ రెడ్డి తెలిపారు. సరఫరా వ్యవస్థ సాధారణంగా పనిచేస్తోందని, నిరంతర సరఫరా కోసం అన్ని ఏర్పాట్లు చేయబడ్డాయని ఆయన వెల్లడించారు.జగిత్యాల జిల్లాలో మొత్తం ఎల్‌పిజి కనెక్షన్లు: 3,44,088గాను రోజు వారి బుకింగ్: 4135 సిలిండర్లు గాను సరిపడా గ్యాస్ డెలివరీ చేయబడుతుంది ఎల్‌పిజి కొరత గూర్చి ఎలాంటి ఆందోలన చెందవద్దని ఆయన అన్నారు. అన్ని గ్యాస్ ఏజెన్సీలు మరియు పెట్రోల్ పంపులలో పెట్రోలియం ఉత్పత్తులు జిల్లా కు సరిపడా ఉన్నాయని, సమచారం, సమస్యల విచారణ కోసము, టోల్ ఫ్రీ: 8886808092 వినియోగదారులు తమ బుకింగ్ స్థితిని ఆన్‌లైన్‌లో లేదా ఎల్‌పిజి యాప్ ద్వారా తనిఖీ చేయవచ్చున్నారు. సోషల్ మీడియాలో వచ్చిన ఎల్‌పిజి గ్యాస్, పెట్రోలియం, డిజిల్ కొరత వదంతులను నమ్మవద్దని గృహ వినియోగాలకి వినియోగించే సిలిండర్లను అక్రమంగా వినియోగిస్తున్న 52 వ్యక్తుల పై 6- ఖ కేసులు నమోదు చేసి అట్టి సిలిండర్లను జప్తు చేసినట్లు తెలిపారు.పౌరసరఫరాల శాఖ, పోలీసు శాఖల సమన్వయంతో అక్రమంగా గ్యాస్ వినియోగిస్తున్న వారిని చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని అలనే పెట్రోల్ బంకులను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని ఆయన తెలిపారు.

## పాఠశాలకు కంప్యూటర్ల వితరణ



**చురకలు విలేకరి ఇబ్రహింపట్నం మార్చి (28) :** జగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం మండల కేంద్రం లోని ప్రాథమికపాఠశాల లో శనివారం 70 వేల విలువ గల కంప్యూటర్, ప్రింటర్ లను చెట్లపెల్లి బాలక్రిష్ణయ్య- నర్సమ్మ ల జ్ఞాపకార్థం కుంటుబ సభ్యులు పాఠశాలకు అందజేశారు.తాహసిల్దార్ వరప్రసాద్ కంప్యూటర్‌ను ప్రారంభం చేసి,14సవత్సరాల క్రింతం చెట్లపెళ్ళి వారి కుంటుబం ప్రతిష్టించిన సరస్వతమాత విగ్రహం వద్ద విద్యార్థులకు అన్నప్రసాదం,పుస్తకాలు, పెన్నులు ఆటవస్తువులు పంపిణిచేశారు.ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వాణీ,నరేంధర్ గౌడ్,రవిందర్ గౌడ్,దేవెంధర్ గౌడ్,సుఖెంధర్ గౌడ్, సత్యనారాయణ గౌడ్, వంశీ, అమర్, రోహిత్, బాలక్రిష్ణ ,స్మరణ్, భువన్ రోహిణి, సృజన, రజిని, శరణ్య, వర్ష ,హరిణి తదితరులు పాల్గొన్నారు.

## ఆలయంలో భక్తుల రద్దీ



**చురకలు విలేకరి, ధర్మపురి, మార్చి 28 :** ప్రాచీన ప్రముఖ పుణ్యక్షేత్రమైన ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో శనివారం భక్తులతో కిటకిటలాడింది. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో క్షేత్రానికి తరలివచ్చి పవిత్ర గోదావరి నదిలో పుణ్యస్నానం ఆచరించి ప్రధాన ఆలయంతో పాటు అన్ని అనుబంధ ఆలయాల్లో బారులు స్వామివారి దర్శించుకున్నారు.భక్తులు స్వామి వారికి పెట్టె నామాలు కోరమీసాలు అర్చన అభిషేకం తదితర మొక్కులు చెల్లించుకున్నారు.

## రాజీమార్గమే రాజమార్గం

**చురకలు విలేకరి, ధర్మపురి, మార్చి 28 :** కేసుల పరిష్కారానికి రాజీ మార్గం రాజమార్గమని ధర్మపురి కోర్టు ఇన్చార్జి జూనియర్ సివిల్ జడ్జి శ్రీనిజ అన్నారు. ధర్మపురి కోర్టు పరిధిలోని 456 కేసులు లో లోక్ ఆదాలాత్ ద్వారా పరిష్కరించారు. కేసు సంబంధిత వ్యక్తులు రాజీమార్గం ద్వారా కేసులు పరిష్కరించుకున్నారు. లోక అదాలత్ లో అడ్మిషన్ కేసులు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు రాజీ అయ్యాయని తెలిపారు. ఏ జి పి ఇమ్మడి శ్రీనివాస్, అడ్వకేట్లు రామడుగు రాజేష్, గడ్డం సత్యనారాయణ రెడ్డి, బత్తిని ఇంద్రకరణ్, జాజల రమేష్ కోర్టు కానిస్టేబుల్ మహేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

## ఎల్వోసి అందించిన ఎమ్మెల్యే



**చురకలు విలేకరి, జగిత్యాల, మార్చి 28 :** జగిత్యాల రూరల్ మండలం అంతర్గాం గ్రామానికి చెందిన బోనగిరి రాధ లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతూ చికిత్స చేసుకునే ఆర్థిక స్థోమత లేక ఇబ్బంది పడుతూ ఉండగా, స్థానిక నాయకులు జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ బాధితురాలు బోనగిరి రాధ లివర్ చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా 2 లక్షల రూపాయల ఎల్‌ఓసి మంజూరు చేయించి, శనివారం జగిత్యాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రాధ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బోనగిరి నారాయణ, నాయకులు ఏలూరి శ్రీనివాస్, బడుగు లక్ష్మీ రాజం తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వం

**-బడ్జెట్ ప్రజలను నిరాశపరిచింది**
**-ప్రతి హామీ నెరవేర్చే వరకు ప్రభుత్వాన్ని నిలదీస్తాం**
**-ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎల్.రమణ**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల మార్చి 28 :** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని, బడ్జెట్ ప్రజలను నిరాశపరిచిందని, ప్రతి హామీ నెరవేర్చు వరకు నిలదీస్తామని ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎల్ రమణ వెల్లడించారు. శనివారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎల్ రమణ వారి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ శాసనసభ,మండలి సమావేశాలల్లో సంక్షేమఊసే లేదన్నారు. ప్రభుత్వం సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని,బడ్జెట్ రాష్ట్ర ప్రజలను తీవ్ర నిరాశకు గురిచేసింది. ముఖ్య మంత్రి నిత్యం ఢిల్లీ పర్యటనలకే పరిమితమయ్యాడన్నారు.ప్రజా సమస్యల పై బీఆర్ఎస్ వివిధ రూపాల్లో పోరాటం కొనసాగిస్తోందని, వైఫల్యాలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినా కనీస స్పందన లేదన్నారు. ఫీ రీయింబర్స్మెంట్ పై గవర్నర్ ప్రసంగంలో ఊసే లేదని,ఆరు పంటలకు ఇవ్వాల్సిన రైతుబంధు 3 పంటలకే ఇచ్చారని, రైతు వ్యతిరేకిగా కాంగ్రెస్ సర్కారు పని చేస్తోందని, కామారెడ్డి డిక్లరేషన్ ఏదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ 9 ఏండ్లలో 43 వేల కోట్లు అభివృద్ధికి వెచ్చించిందని, ప్రతి హామీ అమలు చేసే వరకు సర్కారును నిలదీస్తామన్నారు.సమయాన్నికి అనుకూలంగా పార్టీలకు అనుగుణంగా ఎక్కడైతే గౌరవం లభిస్తుందో అక్కడ ఉండడం సహజమని కేసీఆర్ 50 ఏళ్ల రాజకీయ అనుభవం ఉందని 25 ఏళ్లు పార్టీ నడిపించిన అనుభవం 10ఏళ్లు పరిపాలన చేసిన అనుభవం ఉందని వారి సలహాలు పాటించుకుంటూ ముందుకు సాగుతామని ఎల్ రమణ గారు స్పష్టం చేశారు. అనుభవం ఉన్నవారు ప్రజల శ్రేయస్సు కోసం పాటుపడేవారు ప్రజా సమస్యల పట్ల అవగాహన ఉన్నవారు పార్టీలోకి వస్తే బిఆర్ఎస్ పార్టీ తప్పకుండా ఆహ్వానిస్తుందని తెలిపారు.ప్రజల కోసం పని చేస్తున్నప్పుడు పార్టీ అవకాశాలు ఇస్తుందని పార్టీ హైకండ్ సుప్రీమ్ అని అభిప్రాయం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ కౌన్సిలర్లు, పట్టణ, మండల అధ్యక్ష కార్యదర్శులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# భక్తులతో అడుగులు కలుపుతూ అంజన్న చెంతకు

**-130 కిలో మీటర్లు భక్తులతో నడిచిన ఓ శునకం**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, మార్చి 28 :** మనుషుల మధ్య నమ్మకం మచ్చుకైనా కనిపించని ఈ రోజుల్లో.. పెట్టిన ఒక్క బిస్కెట్ ముక్కకు ప్రాణాన్ని పణంగా పెట్టేంత విశ్వాసాన్ని చాటిందో మూగజీవి. భక్తికి, కృతజ్ఞతకు నిలువెత్తు సాక్ష్యంగా నిలిచిన ఆ శునకం కథ ఇప్పుడు అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది. వివరాల్లోకి వెళ్తే.. ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూరు నుంచి కొండగట్టు అంజన్న దర్శనం కోసం హనుమాన్ దీక్షాపరులు పాదయాత్ర ప్రారంభించారు. ఐదు రోజుల క్రితం ఉట్నూర్ అడవుల వద్ద సేదతీరుతున్న సమయంలో వారికి ఒక శునకం తారసపడింది. ఆకలితో ఉన్న ఆ జీవికి భక్తులు ఐదు రూపాయల బిస్కెట్లు వేశారు.ఇక అంతే..ఆ క్షణం నుంచి ఆ శునకం వారి నీడలా మారిపోయింది. వెళ్లగొట్టినా వినకుండా, ఎండను సైతం లెక్కచేయకుండా సుమారు 130 కిలో మీటర్ల మేర ఆ భక్తులతోనే కలిసి నడిచింది. దట్టమైన ఆదిలాబాద్ అటవీ ప్రాంతంలో వన్యప్రాణుల భయం లేకుండా ఈ శునకమే తమకు రక్షణగా నిలిచిందని భక్తులు భక్తిపారవశ్యంతో చెబుతున్నారు. దానికి జూలీ అని పేరు పెట్టుకున్న భక్తులు.. నడక వల్ల దానికి కాళ్ల నొప్పులు రావడంతో సాక్సులు తొడిగించి మరీ కన్నబిడ్డలా సాకారు. జగిత్యాల మీదుగా కొండగట్టు చేరుకునే వరకు ఆ భక్తులను వీడకుండా తన విశ్వాసాన్ని చాటుకుంది ఈ జూలీ. పెట్టిన కొంచెం అన్నానికి ప్రాణాలనే అడ్డువేసే కుక్కల విశ్వాసం అమోఘం అనడానికి ఈ ఘటనే నిదర్శనం.

# రాజీమార్గమే.... రాజమార్గం..

**-జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.రత్న పద్మావతి**
**-జాతీయ లోక్ ఆదాలత్ లో 3034 కేసుల పరిష్కారం**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, మార్చి 28 :** రాజీమార్గమే.... రాజమార్గమని జగిత్యాల జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.రత్న పద్మావతి అన్నారు. శనివారం జిల్లా కోర్టులో నిర్వహించిన జాతీయ లోక్ ఆదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.రత్న పద్మావతి మాట్లాడుతూ జిల్లాలోని ఆయా కోర్టుల్లో పెండింగ్లో ఉన్న 3034 కేసులు పరిష్కరించామని, అందులో సివిల్ కేసులు 34, క్రిమినల్ కేసులు 2473, ఇతర కేసులు 524లను పరిష్కరించినట్లు తెలిపారు. చాలా కేసుల్లో మధ్యవర్తిత్వం లేకపోవడంతో కేసులు పరిష్కారం కావడం లేదని, సుప్రీంకోర్టు, హైకోర్టు ఆదేశాల మేరకు పెండింగ్ కేసుల పరిష్కారానికి జాతీయ మెగా లోక్ ఆదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. జాతీయ మెగా లోక్ ఆదాలత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కృషి చేసిన న్యాయమూర్తులు, న్యాయవాదులు, పోలీసు అధికారులు, కోర్టు సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు ఎస్. నారాయణ, వెంకట మల్లిక్ సుబ్రహ్మణ్య శర్మ, ఆర్.లావణ్య, శ్రీనిజ కోహిర్కర్, నిఖిషా, పిపిలు చీటి రామకృష్ణరావు, పి.రాజేష్, సూపరిండెంట్ షఫీ, శ్రీనివాస్, కార్యాలయ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## దీక్షపరులకు పండ్లు పంపిణీ




**చురకలు విలేకరి,జగిత్యాల,మార్చి 28 :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీఆంజనేయస్వామి ఆలయానికి పాదయాత్రగా వెళ్తున్న దీక్షపరులు, భక్తులకు శనివారం జగిత్యాల పట్టణానికి చెందిన శ్రీకాంత్ నేహాశ్రీలు పండ్లు, పానీయాలు అందించారు.ఈ కార్యక్రమంలో వర్షిత్, సురేష్, మహేష్,సాయి పాల్గొన్నారు.

## పిల్లలపై తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలి

**-విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి మంచి ఫలితాలు సాధించాలి**



**చురకలు విలేఖరి వీణవంక మార్చి 28 :** వీణవంక మండల పరిధిలోని చల్లూరు ఆల్ఫ్రెడ్ నోబెల్ హై స్కూల్ లో 23వ వార్షికోత్సవం,గ్రాడ్యుయేషన్ డే వేడుకలు అత్యంత ఉత్సాహభరితమైన వాతావరణంలో,ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ మాట్లాడుతూ...విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి,ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. నేటి పోటీ ప్రపంచంలో సాంకేతికతతో పాటు నైతికవిలువలను అలవరచుకోవాల ని సూచించారు.ఎస్ఐ ఆవుల తిరుపతి మాట్లాడుతూ సోషల్ మీడియా విని యోగంలో జాగ్రత్తగా ఉండాలని,అపరిచితులతో వ్యక్తిగత వివరాలు పంచుకో వద్దని హెచ్చరిస్తారు.గంజాయి, డ్రగ్స్ వంటి చెడు వ్యసనాలకు బానిస కావద్దని, స్నేహితుల ఎంపికలో జాగ్రత్తగా ఉండాలని కోరుతారు.మైనర్ డ్రైవింగ్ ప్రమాద కరమని,లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని విద్యార్థుల కు,వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తారు.విద్యార్థుల భవిష్యత్తుకు పునాది పడేది పాఠశాల దశలోనే.ఈ గ్రాడ్యుయేషన్ డే వారిలో కొత్తఉత్సాహాన్ని, బాధ్యతను నింపుతుంది.తమ పిల్లల ప్రతిభను చూసి తల్లిదండ్రులు మురిసి పోయారు.విద్యార్థులకు అతిథుల చేతుల మీదుగా పట్టాలు,ప్రశంసా పాత్రలు అందజేశారు.విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు,నాటికలు,పాటలు ఆహూతులను అలరించాయి.ముఖ్యంగా చిన్నారుల వేషధారణ, ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.ఈ కార్యక్రమంలో సర్పంచ్ రామిడి సంపత్ రెడ్డి, ట్రినిటీ గ్రూప్స్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ డైరెక్టర్ జోన్ థామస్, వీణవంక పాఠశాల కరస్పాండెంట్స్లు మనోజ్ కుమార్,నిషా,ఉప సర్పంచ్ ఫసియోదిన్ విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నాయకుల పరామర్శ



**చురకలు ప్రతినిధి కమాన్పూర్ మార్చి 28 :** కమాన్పూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు చాట్ల గట్టయ్య తల్లి చాట్ల కనకమ్మ చనిపోగా వరి కుటుంబ సభ్యులకు కాంగ్రెస్ పార్టీ నాయకులు పరమర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పెద్దపెల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి గాండ్ల మోహన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బొంపల్లి రాజయ్య మల్యాల తిరుపతి గడప కిష్టమూర్తి దాసరి పిల్లి చంద్రశేఖర్ నగునూరి నర్సయ్య గౌడ్ వెంగలి రాజయ్య బోనాల సత్యం ఎనగంటి మురళి మనోహర్రావు ఎనిగంటి ప్రభాకర్ రావు ఎనగంటి సత్యనారాయణ రావు కమ్మగోని చేల్మయ్యగౌడ్ మహమ్మద్ యూసుఫ్ లల్లూ మట్ట రాజు మల్యాల చిన్న తిరుపతి నూతి కుమారస్వామి తాటికొండ శ్రీనివాస్ గఫూర్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లను గృహప్రవేశాలకు సిద్ధం చేయాలి

**-లబ్ధిదారుల సమస్యలు పరిష్కరించాలి**
**-జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా**
**-నుస్తులాపూర్‌లో ఇందిరమ్మ ఇండ్ల పరిశీలన**



**చురకలు ప్రతినిధి కరీంనగర్ మార్చ్ 28 :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకంలో భాగంగా ప్రారంభించిన ఇండ్లను పూర్తిచేసుకుని గృహప్రవేశాలకు సిద్ధమయ్యేలా చూడాలని జిల్లా కలెక్టర్ చిత్రామిశ్రా అధికారులను ఆదేశించారు. తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్ గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు. లబ్ధిదారులు తుమ్మనవేణ రజిత, కుంటు రాధతో మాట్లాడారు. ఇంటి నిర్మాణానికి ఇప్పటివరకు అయిన ఖర్చు, ప్రభుత్వం నుండి వచ్చిన బిల్లులు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. గృహ నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసుకొని పూర్తి లబ్ధి పొందాలని సూచించారు. ఈ సందర్భంగా హౌసింగ్, పంచాయతీరాజ్ అధికారులతో మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లు త్వరితగతిన పూర్తి చేసుకునేలా లబ్ధిదారులను ప్రోత్సహించాలని అన్నారు. వారికి ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే పరిష్కరించాలని అన్నారు. ఇండ్ల నిర్మాణానికి ఇసుక సరఫరాలో ఇబ్బందులు రాకుండా చూడాలని ఎంపీడీవోను ఆదేశించారు. మోడల్ గ్రామాలు, మొదటి మొదటి దఫాలో ఎంపికైన లబ్ధిదారుల ఇండ్లు నూరు శాతం పూర్తయ్యేలా చూడాలని అన్నారు. కలెక్టర్ వెంట గృహనిర్మాణ సంస్థ ప్రాజెక్టు సంచాలకులు శ్రీనివాస్, డి.ఈ వెంకటరమణ ,ఏ.ఈ శ్రీజ, ఎంపీడీవో మల్హోత్రా, తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు.

# అధికారుల మధ్య కుదరని సయోధ్య

**-మీడియాకు వివరాలు పంపిన ఎంపీఓ జోగం రాజ**





**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట, మార్చి 28 :** ఎల్లారెడ్డిపేట మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పని చేస్తున్న ఇద్దరు కీలక అధికారుల మధ్య సయోధ్య కుదరకపోవడంతో ఒక్కొక్కటి గా లోపాలు బయటపడు తున్నాయి వివరాలు ఇలా ఉన్నాయి ఎల్లారెడ్డిపేట ఎంపీడీవోగా గుండోజు సత్తయ్య ఎంపీఓగా జోగం రాజు పనిచేస్తున్నారు. కాగా ఇరువురి మధ్య సఖ్యత కుదరకపోవడంతో ఎంపిడిఓపై ఎంపిఓ మీడియాకు ఎంపీడిఓ సత్తయ్య చేసిన అక్రమాలు వెల్లడించారు. ఈ మేరకు ఎంపీడీవో గుండోజు సత్తయ్య చేసిన అక్రమాలపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు ఎంపీవో జోగం రాజు తెలిపారు. ఎల్లారెడ్డిపేట మండలం బుగ్గ రాజేశ్వర తండా పంచాయతీ కార్యదర్శి గా పనిచేసిన కార్యదర్శి నిధులను వ్యక్తిగత అవసరాలకు వినియోగించి తిరిగి చెల్లించినప్పటికీ అతనికి ఎంపీడీవో సత్తయ్య నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ ఇవ్వలేదని ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామపంచాయతీ అటెండర్ ను ఎలాంటి అధికారిక ఉత్తర్వులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా మండల పరిషత్ కార్యాలయంలో వ్యక్తిగత పనులకు వినియోగించడం అనంతరం ఆమెను తిరిగి రిలీవ్ చేసి తన తప్పిదం తెలుసుకొని ఎంపీడీవో మేజర్ గ్రామ పంచాయతీకి అటెండర్‌గా పంపించా డని ఎంపీఓ జోగం రాజు పేర్కొన్నారు. మండల కార్యాలయంలో ఇద్దరు అటెండర్ ఉన్నప్పటికీ వారికి కేటాయించిన విధులు చేయించకుండా వ్యక్తిగత పనులు చేయించుకుంటూ కార్యాలయ శుభ్రతను ఎంపీడీవో నిర్లక్ష్యం చేశారని ఎంపీఓ ఎంపీడీవో పనితీరును విమర్శించారు పంపు డ్రైవర్ / మెకానిక్ జీతం 15వ ఆర్థిక సంఘం నిధుల నుండి చెల్లించరాదని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ వాటిని తుంగలో తొక్కి ఎల్లారెడ్డిపేటలో గతంలో పనిచేసిన పంచాయతీ కార్యదర్శి తంగేడపల్లి ప్రవీణ్ కుమార్ గదిలో అతనితో వ్యక్తిగత సేవలు చేయించు కోవడం జరిగిందని అన్నారు. ఈ పంచాయతీకి సంబంధించిన రికార్డుల నిర్వహణ మొత్తం మండల పంచాయతీ అధికారిగా నేను బాధ్యతలు స్వీకరించే సమయానికి గ్రామపంచాయతీ నిధులు సూపరింటెండెంట్ ఖాతాలో జమ చేసి ఎంపీడీవో దుర్వినియోగానికి పాల్పడ్డా డని ఎంపిఓ ఆరోపించారు. మండల పరిషత్ నిధులతో కొనుగోలు చేసిన ఇన్వర్టర్లు సరైన రీతిలో నిర్వహించక పోవడంతో అవి పూర్తిగా పనిచేయ కుండా మూలకు పడేయబడ్డాయని గ్రామపంచాయతీ ఎన్నికల ప్రక్రియను తాను స్వయంగా పర్యవేక్షించి పూర్తి చేయడం జరిగిందని ఎంపీఓ పేర్కొన్నారు. ఎన్నికల రెమ్యునరేషన్ చెల్లింపులు అసమానతలు జరిగాయని కొంతమందికి పూర్తి చెల్లింపులు చేయకుండా మిగతా మొత్తాన్ని సూపరింటెండెంట్ మరియు ఎంపీడీవో సొంత ఖాతాలలో వేసుకున్నట్లు తనకు పూర్తి సమాచారం ఉందని ఆరోపించారు పంచాయతీ కార్యదర్శుల సమావేశాల్లో కనీస సౌకర్యాలు కూడా ఏర్పాటు చేయడం లేదని ఎంపీఓ ఆరోపించారు గత రెండు సంవత్సరాలు గా సివిల్ రైట్స్ డే కు ఎంపీడీఓ హాజరు కాలేదని ఎంపీఓ ఆరోపించారు. ఎంపీడీవో సత్తయ్య ప్రతి గ్రామ పంచాయతీ సందర్శనలో డీజిల్ ఖర్చుల పేరిట 2000 రూపాయల నుండి 3000 రూపాయల వరకు వసూలు చేస్తున్నట్లు తన వద్ద పూర్తిస్థాయి ఆధారాలు సమాచారం ఉందని జిల్లా స్థాయి అధికారులకు అందజేయను న్నట్లు ఎంపీఓ పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారిగా ఎంపీడీవో సత్తయ్య పనిచేసిన సమయంలో 30 లక్షల రూపాయలు ట్రెజరీలో జమ చేయకుండా ఎంపీడీవో సత్తయ్య స్వాహా చేశారని ఎంపీఓ విలేకరులకు తెలిపారు మండలంలో 517 ఇందిరమ్మ ఇండ్లలో కేవలం 42 మాత్రమే పూర్తయ్యాయని ఎంపీడీవో పర్యవేక్షణ పూర్తిగా కొరవ డిందని ఎంపీఓ పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ నిధులు లక్షల్లో దుర్విని యోగం చేయబడ్డాయని రికార్డులు సరిగా నిర్వహించబడలేదని పేర్కొన్నారు. గుండారం గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న దేవరాజ్ అనే పంచాయతీ కార్యదర్శి పంచాయతీ కార్యదర్శి సంఘం ముసుగులో పంచాయతీ కార్యదర్శులు అందరి సంతకాలను సింగారం పంచాయతీ కార్యదర్శి గణేష్ చేత ఫోర్జరీ చేయించి తనపై జిల్లా కలెక్టర్ కు తప్పుడు ఫిర్యాదు చేయించారని ఎంపీఓ ఆవేదన వ్యక్తం చేశారు. దేవరాజ్ ప్రస్తుతం గుండారం పంచాయతీ కార్యదర్శి గా పనిచేస్తున్నాడని దేవరాజ్ ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న సమయంలో 10లక్షల రూపాయలు గ్రామ పంచాయతీ నిధికి జమ చేయకుండా దుర్వినియోగం చేశాడని ఎంపీఓ ఆరోపించారు. ఒకే కార్యాలయంలో ఇద్దరు కీలక అధికారులుగా పని చేస్తున్నప్పటికీ ఎంపీ ఓ జోగం రాజు ఎంపీడీవో గుండోజు సత్తయ్య పై ఆరోపణలు చేయడం జిల్లా వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తుంది. వీరి ఇరువురి శైలిపై జిల్లా కలెక్టర్ స్పందించి విచారణ జరిపితే పూర్తిస్థాయి అవకతవకలు బయటపడే అవకాశాలు ఉన్నాయని ప్రజలు చర్చించుకుంటున్నారు. కాగా ఇప్పటికే ఎంపీఓ జోగం రాజుపై మండల పంచాయతీ కార్యదర్శులు ఎంపీఓ రాజు మమ్మల్ని ఇబ్బంది పెడుతున్నాడని ఎంపీడీవో గుండోజు సత్తయ్య కు జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. ఎంపీఓ జోగం రాజు ఎంపీడీవో సత్తయ్య పై చేసిన ఆరోపణలపై తెలుగు ప్రభ ఫోన్ లైన్ లో వివరణ కోరడానికి ప్రయత్నించగా ఎంపీడీవో సత్తయ్య స్పందించలేదు.

# దాడికి పాల్పడిన వ్యక్తి అరెస్టు

**చురకలు ప్రతినిధి, జగిత్యాల, మార్చి 28 :**

గొల్లపల్లి మండలం మల్లన్న పేట గ్రామానికి చెందిన లక్కాకుల మనోజ్ అనే వ్యక్తిపై దాడికి పాల్పడిన కేసులో రౌడీ షీటర్ దీక్షిత్ను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు జగిత్యాల టౌన్ ఇన్స్పెక్టర్ కరుణాకర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం లక్కాకుల మనోజ్ వద్ద దీక్షిత్ గతంలో రూ.80వేలను అప్పుగా తీసుకొని, మార్చి 17న డబ్బులు తిరిగి ఇస్తానని పట్టణంలోని టైంపాస్ టీ పాయింట్ వద్దకు పిలిచి దీక్షిత్ స్నేహితులైన కుసుంబ నిఖిల్, నరేష్ లతో కలసి మనోజ్ తలపై కూల్డ్రింక్ సీసాతో దాడి చేసి అతని వద్ద ఉన్న రూ.2వేల నగదును బలవంతంగా లాక్కున్నారు. బాధితుడు లక్కాకుల మనోజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, శనివారం నిందితుడైన రౌడీ షీటర్ దీక్షిత్ను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు వెల్లడించారు.

## డంపింగ్ యార్డ్ వద్దంటూ మహిళల నిరసన



**చురకలు ప్రతినిధి హుజురాబాద్ మార్చి 28 :** హుజురాబాద్ మండలం సిరిసపల్లి గ్రామ శివారులో ప్రభుత్వం ప్రతిపాదించిన డంపింగ్ యార్డ్ ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక మండలంలోని మహిళా సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం శనివారం జరిగింది. స్థానిక అంబేద్కర్ కూడలి వద్ద జేఏసీ ఆధ్వర్యంలో జరుగుతున్న నిరసన శిబిరం వద్దకు మహిళలు పెద్ద ఎత్తున చేరుకున్నారు. డంపింగ్ యార్డ్ వద్దంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ప్రజాప్రతినిధులు రాజకీయ పార్టీలు డంపింగ్ యార్డ్ నిర్మాణాన్ని అడ్డుకోవాలని లేకుంటే ఉద్యమిస్తామని వారు స్పష్టం చేశారు.

## మొలంగూర్‌లో గుప్త నిధుల తవ్వకాలపై విచారణ చేయాలి

**-టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు మోరే గణేష్**



**చురకలు ప్రతినిధి హుజురాబాద్ మార్చి 28 :** శంకరపట్నం మండలం మొలంగూర్ గ్రామంలోని చారిత్రక ఖిల్లా వద్ద గుర్తు తెలియని వ్యక్తులు ఈ నెల 24న రెండు కార్లలో వచ్చి ఖిల్లా ద్వారం వద్ద గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపారని తెలంగాణ జన సమితి (టీజేఎస్) జిల్లా అధ్యక్షుడు మోర్ గణేష్ ఆరోపించారు. చారిత్రాత్మక కట్టడమైన మొలంగూర్ ఖిల్లా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ప్రభుత్వంపై ఉందని ఆయన అన్నారు. జిల్లా అధికార యంత్రాంగం ఈ ఘటనపై విచారణ చేసి ఖిల్లా వద్ద తవ్వకాలు జరిపిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకొని చట్ట ప్రకారం శిక్షించాలని ఆయన జిల్లా కలెక్టర్కు వినతిపత్రం సమర్పించారు.

## ఓపెన్ పది, ఇంటర్ పరీక్షలపై సమీక్ష



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట మార్చి 28 :** రాజన్న సిరిసిల్ల జిల్లాలో తేదీ: 20.04.2026 నుండి 27.04.2026 వరకు ఓపెన్ (టాస్) ఇంటర్మీడియట్ మరియు పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు సిరిసిల్లలో (03) సెంటర్లు, వేములవాడలో (02) సెంటర్లలో జరుగనున్నాయి. అలాగే తేదీ: 28.04.2026 నుండి 05.05.2026 వరకు ప్రాక్టికల్ పరీక్షలు (01) సెంటర్ లో జరుగనున్నాయి. పరీక్షల ఏర్పాట్ల కొరకు జిల్లా కలెక్టర్ గారి ఆదేశాల మేరకు అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) గడ్డం నగేష్ ఆధ్వర్యంలో సంబంధిత జిల్లా అధికారులతో అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) గారి ఛాంబర్ లో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో విద్యుత్ శాఖ, పోస్టల్ శాఖ, పోలీస్ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, ఆర్టీసీ అధికారులు, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి, జిల్లా విద్యాధికారి హాజరయ్యారు. ఇట్టి సమావేశంలో అడిషనల్ కలెక్టర్ శ్రీ. జి. నగేష్ గారు సంబంధిత అధికారులకు ఓపెన్ స్కూలు పరీక్షలు ప్రశాంతంగా జరుగుట కొరకు తగు సూచనలు ఇవ్వడం జరిగినదని జిల్లా విద్యాధికారి శ్రీ. డా. బి. జగన్ మోహన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సమీక్షలో అదనపు ఎస్పీ చంద్రయ్య, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

# డ్రైవర్ల కంటిచూపే ప్రయాణికుల భద్రత

**-కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం**
**-గంగాధర మండలంలో ఘనంగా ఉచిత కంటి వైద్య శిబిరం**
**-హాజరైన వందలాది మంది ఆటో, లారీ మరియు కార్ డ్రైవర్లు**



**చురకలు ప్రతినిధి, కరీంనగర్ (గంగాధర) మార్చి 28 :** కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండవ దశ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా, శనివారం గంగాధర మండలం మధురానగర్ గ్రామంలోని వివిఎస్ గార్డెన్స్ వద్ద ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. లయన్స్ క్లబ్ సహకారంతో నిర్వహించిన ఈ శిబిరాన్ని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ముఖ్య అతిథిగా విచ్చేసి, ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణలో డ్రైవర్ల కంటి చూపు అత్యంత కీలకమని పేర్కొన్నారు. డ్రైవర్లు తమ ఆరోగ్యంపై, ముఖ్యంగా కంటి చూపుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టడం ద్వారా తమ ప్రాణాలతో పాటు ప్రయాణికుల భద్రతను కూడా కాపాడవచ్చని సూచించారు.రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించడమే ఈ శిబిరం ముఖ్య లక్ష్యమని ఆయన వివరించారు.ఉదయం 10 గంటల నుండి ప్రారంభమైన ఈ శిబిరానికి ప్రాంతీయ వాహన డ్రైవర్ల నుండి విశేష స్పందన లభించింది. ఆటో, లారీ, కార్ తదితర వాహన డ్రైవర్లు పెద్ద సంఖ్యలో హాజరై కంటి పరీక్షలు చేయించుకున్నారు. నిపుణులైన వైద్య బృందం డ్రైవర్లకు సమగ్ర పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు మరియు తగు సూచనలు అందజేశారు.ఈ కార్యక్రమంలో కరీంనగర్ రూరల్ ఏసీపీ విజయ్ కుమార్, చొప్పదండి సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రదీప్ కుమార్, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్స్ రవికుమార్, రజిని, మండల ఎంపిడివో రాము, మండల తహాశీల్దార్ రజిత పాల్గొన్నారు. అలాగే గంగాధర, చొప్పదండి పరిధిలోని ఎస్.ఐ లు వంశీకృష్ణ, రాజు, నరేష్ రెడ్డి, స్థానిక గ్రామ సర్పంచ్ లు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మార్చి ఏ పైసా వసూల్...!

**-100 శాతం బకాయిలు వసూళ్లే లక్ష్యం**
**-ఇంటికే వెళ్ళి బకాయిలు వసూల్లు చేస్తున్న వైనం**
**-పన్నుల వసూళ్ల కోసం బృందాలు గా సిబ్బంది**
**-శరవేగంగా వసూళ్ళు చేస్తున్న వివిధ శాఖలు**





**చురకలు విలేకరి ఇబ్రహింపట్నం మార్చి (28) :** ప్రతి శాఖ కు మార్చి నెల అనగానే సవత్సరం పుర్తి అవటంతో పాటు చెల్లింపు లు ,రాబడి ని వసుల్లు చేసి జమలు చెసె పనీలో నిమజ్జనం అవుతారు.పలు బ్యాంకులు ఇదువరకే ఇచ్చిన లోన్ ల రికవరి,గ్రామపంచాయతీ, విధ్యుత్ శాఖ లు టార్గెట్ పెట్టుకుని మరి వినియోగదారులు లోన్ తిసుకున్న రైతులు, వ్యాపారులనుండి బకాయిలు తిరిగి కట్టించుకునే ప్రయత్నం లో నిమజ్జనం అయ్యారు.గత 15 రోజులు గా మార్చి నెలలో పుర్తిగా బకాయిలు100 శాతం వసుల్లు చేయ్యలనే లక్ష్యం తో పని చేస్తున్నారు. గ్రామపంచాయతీ కార్యదర్శులు ఉన్నత అదికారుల అదేశాలతో అభివృద్ధి పరుగులు పెట్టాలంటే ఇంటి పన్ను కట్టారని,విధ్యుత్ శాఖ ఉన్నత అదికారుల అదేశాలతో డివిజన్ పరిధిలోని మెట్ పల్లి, మల్లపుర్, ఇబ్రహింపట్నం గ్రామలలో క్యాంపు లను నిర్వహించి విధ్యుత్ బకాయిలు వసుల్లు చేస్తున్నరు.ఈనెల 31వ తేదీలోపు 100 శాతం బకాయిలు వసూలు చేసేందుకు అధికారులు దృష్టిసారించారు. ఇప్పటికే ఇబ్రహింపట్నం మండలం లోని గోదుర్,తిమ్మపుర్, తిమ్మపుర్ తండ,యామపుర్, వేములకుర్తి, బర్దిపుర్, ములరాంపుర్, ఎర్దండి, కోమటికోండాపుర్, వర్షకోండ, డబ్బ, అమ్మకపెట్, ఇబ్రహింపట్నం, కేశాపుర్, కోజన్ కోత్తుర్,ఎర్రాపుర్ గ్రామలలో 15246 ఇండ్లకు ఇంటిపన్ను రుపాయలు 1,01,94,940 ఉండగా ఇప్పటికీ రుపాయలు 97,49,385 వసుల్లు చేయగా రుపాయలు 4,45,555 చేయ్యల్సిఉంది.దాదాపు 95 శాతానికి పైగా ఆస్తిపన్ను వసూలు చేశారు.అధికారులు మిగిలిన బకాయిలు చేపట్టాలని నిర్ణయించారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో పన్ను వసూళ్లపై ఎవరికీ మినహాయింపులు ఇవ్వకుండా ఖచ్చితంగా వసూళ్లు చేస్తున్నారు.బ్యాంకు సిబ్బంది సంబందిత ఖాత దారులు ఎల్ టి,క్రాపు తదితర లోన్ తిసుకున్న వారినుండి ఇప్పటికే వసుల్లు చేస్తున్నారు.

**వందశాతం పన్ను వసూళ్లే లక్ష్యం...**

**రామకృష్ణ ఎంపిడిఓ ఇబ్రహింపట్నం**



ఇబ్రహింపట్నం మండలం లోని అన్ని గ్రామలవో ఆస్తి పన్ను పూర్తిస్థాయిలో వసూలు చేసేందుకు మైక్‌ల ద్వారా ప్రచారం చేయించడమే కాకుండా, ప్రధాన కూడళ్లలో ప్రత్యేకంగా గ్రామస్తులను కలిసి బకాయిలు చెల్లిపు సమావేశంలో నిర్వహిచాం పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది ఉదయం బకాయిలు వసుల్లు చేస్తున్నారు. గత ఏడాది కంటే ఈ ఏడాది వందశాతం పన్ను వసూలు చేసే లక్ష్యం దిశగా ప్రయత్నాలు చేస్తున్నారు.

**బకాయిల వసూళ్ల కోసం ప్రత్యేకంగా సిబ్బంది**

**మదుసుధన్ విధ్యుత్ శాఖ డివిజన్ అదికారి**



విధ్యుత్ శాఖ ఉన్నత అదికారుల అదేశాల మేరకు మెట్ పల్లి డివిజన్ పరిధిలో విధ్యుత్ ను వినియెగించుకోని శాఖ చెల్లించవలసిన బకాయిలు వసూళ్లు చేపట్టేందుకు ప్రత్యేక అఫిస్ సిబ్బంది, పలు వురిని టీంలను ఏర్పాటు చేశాం. మైక్ లలో చాంటిపు చెయిస్తు గ్రామలలో ఉదయం నుండి సాయంత్రం వరకు ముడు టీం లు విద్యుత్ వినియోగదారుల నుండి బకాయిలు వసూళ్లే లక్ష్యంగా సిబ్బంది పనిచేస్తున్నారు.



## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట మార్చి 28 :** ఎల్లారెడ్డిపేట మండలంలోని నారాయణపూర్ గ్రామంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శనివారం మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ ఎస్కే సాబేరా బేగం పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో 88 లక్షల రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను సిరిసిల్ల నియోజకవర్గ ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డి పంపించడం జరిగిందన్నారు పేద ప్రజలను ఆదుకోవడానికి రాజీవ్ ఆరోగ్యశ్రీ 5 లక్షల రూపాయల నుండి 10 లక్షలకు పెంచడం జరిగిందన్నారు అత్యవసర చికిత్సల కోసం నిమ్స్ లో చికిత్స పొందుతూ ఉంటే ఎల్ ఓ సి లను కూడా అందిస్తామన్నారు ముందుగా డబ్బులు ఖర్చు పెట్టుకుంటే ముఖ్యమంత్రి సహాయనిధికి పంపించి వారికి డబ్బులు ఇప్పించడం జరుగుతుందన్నారు నారాయణపూర్ గ్రామంలో 8 మందికి 1, లక్ష 90, వేలు చెక్కులను పంపిణీ చేస్తున్నామని అన్నారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ దొమ్మాటి నర్సయ్య ఉపసర్పంచ్ మధుసూదన్ రెడ్డినాయకులు సిరిపురం మహేందర్ దొమ్మాటి రాజు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్‌గా సంఘనభట్ల దినేష్



**చురకలు విలేకరి,ధర్మపురి,మార్చి 28 :** జగిత్యాల జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్‌గా ధర్మపురి పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ఏఐసిసి సభ్యులు సంఘనబట్ల దినేష్‌ను నియమిస్తూ గ్రంథాలయ శాఖ కార్యదర్శి యోగిత రాన శనివారం నియామక ఉత్తర్యులు విడుదల చేశారు. సంఘనభట్ల దినేష్ ఆది నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకునిగా,మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ నమ్మిన బంటుగా పనిచేసి నేడు గ్రంథాలయచైర్మన్ గా నియామకమైన సందర్భం గా పట్టణవాసులు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.సంఘనబట్ల దినేష్ గతంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి చైర్మన్‌గా పదవి చేపట్టారు.ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న పదవి నేడు వరించడంతో ధర్మపురి పట్టణానికి చెందిన ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.

## కళాకారులను గుర్తించేందుకే 'నల్ల వజ్రం' అవార్డులు



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ మార్చి 28 :** పారిశ్రామిక ప్రాంతమైన గోదారి ఖనిలో కళాకారులను గుర్తించేందుకే నల్ల వజ్రం అవార్డులను ఇవ్వడం జరుగుతుందని తార ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు సంఖ్య రాజేష్ అన్నారు. గోదావరిఖని ఆర్కే గార్డెన్లో నేనున్నానని శనివారం సాయంత్రం తార అకాడమీ వారు ఉగాది పురస్కారాలు నల్ల వజ్రం అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సాంస్కృతిక సైనికుడు ఆడియో వీడియో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన బొగ్గు గని ప్రాంతంలో ఎందరో సినీ జానపద విప్లవాల కళాకారులకు పుట్టినిల్లు మన గోదావరిఖని అన్నారు. గంటాడి కృష్ణ మ్యూజికల్ పాటలు అలరించాయి. కార్యక్రమానికి మేజిక్ రాజా, నరసయ్య ఇలా వ్యాఖ్యానం అలరించింది.ఈ కార్యక్రమంలో ఏ ఆర్ ఏసీపి ప్రతాప్, ఎన్సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల శ్రీధర్ యాదవ్, పిపి దొంగ రవి, దామెర శంకర్, కవ్వం పల్లి స్వామి, దయా నర్సింగ్, జనగామ రాయనరసు, తదితరులు పాల్గొన్నారు.

# ఏసిటిఓలకు గజిటెడ్ హోదా ఆమోదం

**-టిసిటిఎన్జీవోస్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మొహమ్మద్ ముజాహిద్ హుస్సేన్**



**చురకలు ప్రతినిధి,హుజురాబాద్, మార్చి 28 :** అప్పటి వాణిజ్య పన్నుల శాఖ మరియు ఎక్సైజ్ శాఖ రెవెన్యూ ప్రిన్సిపాల్ సెక్రటరీ అజయ్ మిశ్రా వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ ఏ అనిల్ కుమార్ లకు తెలంగాణ వాణిజ్య పన్నుల శాఖ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఉద్యోగ సంఘాల నాయకులు కలిసి వినతి పత్రం అందించగా దాదాపు 9 సంవత్సరాలు అనంతర ఈరోజు వాణిజ్య పన్నుల శాఖలో పనిచేస్తున్న ఏసీటీవో లకు గెజిటెడ్ హోదా ఆమోదం పరిచిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో పాటు వాణిజ్య పన్నుల శాఖ మరియు ఎక్సైజ్ శాఖ రెవెన్యూ ప్రిన్సిపాల్ సెక్రటరీ ఎం రఘునందన్ రావు చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా లా సెక్రటరీ జెఎడి సర్వీసెస్ సెక్రటరీ ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క వీరి అందరి ఆమోదముతో వాణిజ్య పన్నుల శాఖలో పనిచేస్తున్న 537 మంది ఏ సి టి ఓ లు ఇప్పుడు వాణిజ్య పన్నుల శాఖలో గజిటెడ్ హోదా పొందినారు అని తెలంగాణ వాణిజ్య పన్నుల శాఖ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ తెలిపారు. ఈ సందర్భంగా మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ మాట్లాడుతూ తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్ 2 లో కోపరేటివ్ రిజిస్టర్ సబ్ రిజిస్ట్రార్ సబ్ ట్రెజరీ అధికారి డిప్యూటీ తాసిల్దార్ మున్సిపల్ కమిషనర్ వెహికల్ ఇన్స్పెక్టర్ ఇంతమంది ఉద్యోగులు గతంలో వారి వారి శాఖలో పనిచేస్తున్నప్పుడు వారందరూ ఆ శాఖలలో గజిటెడ్ హోదాలో పనిచేస్తున్నారు గ్రూప్-2 పరిధిలో అందరికంటే ఎగ్జామినేషన్లో ఎక్కువ మార్కులు వచ్చిన వారిని వాణిజ్య పన్నుల శాఖలో ఏ సి టి ఓ గా నియమిస్తారు కానీ ఈ శాఖలో పనిచేస్తున్న ఏసీటీవో లు ఇప్పటివరకు నాన్ గెజిటెడ్ హోదాలో కొనసాగినారు మాకెందుకు ఏసిటిఓ లకు గజిటెడ్ హోదా ఎందుకు ఇవ్వరని తెలంగాణ వాణిజ్య పన్నుల శాఖ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ దాదాపు పది సంవత్సరాల నుండి సుధీర్గముగా అన్ని రకాల పోరాటాలు చేసి ఈరోజు వాణిజ్య పన్నుల శాఖలో పనిచేస్తున్న ఏ సి టి ఓ లకు గజిటెడ్ హోదా సాధించిన సంఘం తెలంగాణ వాణిజ్య పన్నుల శాఖ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల ఈరోజు ఏ సి టి ఓ లకు గెజిటెడ్ హోదా సాధించిన ఘనత మా సంఘమని గర్వంగా చెప్పిన మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ మా కృషివల మా పట్టుదలతో ఈరోజు వాణిజ్య పన్నుల శాఖలు పనిచేస్తున్న 537 మంది ఉద్యోగులకు గజిటెడ్ హోదా రావడానికి పట్టుదలతో దాదాపు పది సంవత్సరాలు అన్ని రకాల పోరాటాలు చేసి సాధించిన ఘనత మా సంఘం అని తెలంగాణ వాణిజ్య పన్నుల శాఖ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం అని మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ అన్నారు ఈ సంఘం ద్వారా ఎన్ని రెప్రజెంటేషన్లు ఎన్ని ప్రయత్నాలు చేసిన ప్రతి ఒక్క డాక్యుమెంట్స్ మా సంఘం వద్ద ఉంది కావాలంటే ఎప్పుడైనా చూపెట్టడానికి మా సంఘం ఫైళ్లు తెరిచి ఉంటాయని మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ అన్నారు ఎవరు చేయనటువంటి ఏ సంఘం చేపట్టినటువంటి పోరాటం చేసి పది సంవత్సరాలు సుదీర్ఘముగా పోరాటం చేసి ఈరోజు వాణిజ్య పన్నుల శాఖలు పనిచేస్తున్న 537 మంది ఉద్యోగులకు ఏ సి టి ఓ హోదా రావడానికి పట్టుదలతో కృషి చేసిన నాయకుడే మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ అని అన్నారు వాణిజ్య పన్నుల శాఖలో పనిచేస్తున్న ఏ సి టి ఓ లకు గజిటెడ్ హోదా ఆమోదం పరిచిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వాణిజ్య పన్నుల శాఖ ఎక్సైజ్ శాఖ రెవెన్యూ ప్రిన్సిపాల్ సెక్రెటరీ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు ఆర్థిక శాఖ ప్రిన్సిపాల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా డిప్యూ టీ చీఫ్ మినిస్టర్ బట్టి విక్రమార్క లకు అందరికీ పేరుపేరునా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసిన మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ తెలంగాణ రాష్ట్రం అంతట వాణిజ్య పన్నుల శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులు సంబరాలు చేసుకుంటున్నారు అని మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ తెలిపారు



# ఆరోగ్యమే మహాభాగ్యం



**-జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.రత్న పద్మావతి**

**చురకలు ప్రతినిధి, జగిత్యాల, మార్చి 28 :**

ఆరోగ్యమే మహాభాగ్యమని జగిత్యాల జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.రత్న పద్మావతి అన్నారు. శనివారం జిల్లా కోర్టు కార్యాలయంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిణి డా.సుజాత,జిల్లా న్యాయమూర్తులతో కలసి ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.రత్న పద్మావతి జిల్లా కోర్టు కార్యాలయంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఏర్పాటుకు కృషి చేసిన జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిణి డా.సుజాతకు కృతజ్ఞతలు తెలిపారు.కోర్టుకు వచ్చే న్యాయవాదులు, కార్యాలయ అధికారులు, సిబ్బంది, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఉండవద్దనే ఉద్దేశ్యంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, ఈ ఆరోగ్య కేంద్ర సేవలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు ఎస్.నారాయణ, వెంకట మల్లిక్ సుబ్రహ్మణ్య శర్మ, ఆర్.లావణ్య, శ్రీనిజ కోహిర్కర్, నిఖిషా, పిపిలు చీటి రామకృష్ణరావు, పి.రాజేష్, సూపరిండెంట్ షఫీ, శ్రీనివాస్, కార్యాలయ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# శశికళ సేవలు మహిళలకు స్ఫూర్తి



**- అభినందించిన శ్రీ సీతారామ సేవా సమితి అధ్యక్షురాలు గోలివాడ చంద్రకళ**

**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ మార్చి 28 :** గోదావరిఖనికి చెందిన ప్రైవేట్ ఉపాధ్యాయురాలు అట్లూరి శశికళ సమాజ సేవలో ముందుండి నేటి మహిళలకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. ఎం.ఏ తెలుగు, ఎం.ఏ సంస్కృతం పూర్తి చేసిన ఆమె 1995--2015 వరకు సెయింట్ పాల్స్‌లో, ప్రస్తుతం సింగరేణి సెక్టర్-2లో తెలుగు టీచర్‌గా పనిచేస్తున్నారు. నెలకు సుమారు రూ.18 వేల జీతాన్ని కూడా సేవా కార్యక్రమాలకే వినియోగిస్తూ, తన కొడుకు పేరున పెట్టిన అనుదీప్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మహిళలకు టైలరింగ్, బ్యూటీషియన్, జ్యూట్ బ్యాగులు తదితర శిక్షణలు అందిస్తున్నారు. ఇప్పటివరకు పది బ్యాచులు పూర్తి చేశారు. నిరుపేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందిస్తున్నారు. ఈ సేవలకు భర్త ఎస్. రత్నశేఖరరావు సహకారం ఉందని తెలిపారు. ఇటీవల అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సింగరేణి సేవా సమితి, లేడీస్ క్లబ్ ఆధ్వర్యంలో బంగ్లాస్ ఏరియా పార్క్‌లో ఆమెను సత్కరించారు. ఈ కార్యక్రమంలో డి. అనిత లలిత్ కుమార్, మనాలి టాకూర్, జె. అరుణశ్రీ (ఐఏఎస్), డాక్టర్ త్రిప్తిజా, డి. లలిత్ కుమార్, వనజ వెంకటయ్య పాల్గొని అభినందించారు.

**శశికళ సేవలు స్ఫూర్తి...**

శ్రీ సీతారామ సేవా సమితి అధ్యక్షురాలు గోలివాడ చంద్రకళ మాట్లాడుతూ... శశికళ టీచర్ కొడుకు జ్ఞాపకార్థం ట్రస్ట్ స్థాపించి నెలంతా సంపాదించిన జీతాన్ని మొత్తం పేదల కోసం ఖర్చు చేయడం గొప్ప విషయమన్నారు. మహిళలకు ఉచిత శిక్షణతో ఉపాధి కల్పిస్తూ, పేద విద్యార్థులకు సాయం చేస్తూ శశికళ ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు.

# చిన్న దూరమైనా సీట్ బెల్ట్ ధరించండి

**-ప్రాణ రక్షణలో కీలక పాత్ర: సీపీ అంబర్ కిషోర్ ఝా**



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ మార్చి 28 :** ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంపు లక్ష్యంగా 'అరైవ్ అలైవ్ -- ఫేజ్-xxx' కార్యక్రమాలు రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు రామగుండం కమిషనరేట్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'అరైవ్ అలైవ్' ఫేజ్-xxx కార్యక్రమంలో భాగంగా గోదావరిఖని వన్ టౌన్ సీఐ ఇంద్రసేనా రెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ చౌరస్తా వద్ద ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా,పెద్దపల్లి డీసీపీ రామ్ రెడ్డి, గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్ హాజరయ్యారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ, వాహనదారుల ప్రాణ రక్షణ ప్రధాన లక్ష్యంగా ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.కారులో ప్రయాణించే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు.ప్రస్తుతం జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో దాదాపు 70 శాతం కేసుల్లో సీట్ బెల్ట్ ధరించకపోవడం వల్లనే తీవ్రమైన గాయాలు లేదా ప్రాణనష్టం జరుగుతున్నట్లు తెలిపారు.సీట్ బెల్ట్ వినియోగం వల్ల ప్రమాద సమయంలో ప్రాణాపాయం గణనీయంగా తగ్గుతుందని వివరించారు.ఫోర్ వీలర్ వాహనాల్లో ఎయిర్ బ్యాగులు ఉన్నప్పటికీ,సీట్ బెల్ట్ ధరించకపోతే అవి సమర్థవంతంగా పని చేయవని స్పష్టం చేశారు.కాబట్టి ఎయిర్ బ్యాగులు ఉన్నా లేకపోయినా ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు. వాహనం కొనుగోలు సమయంలో ప్రజలు అధునాతన భద్రతా సదుపాయాలు కలిగిన మోడళ్లను ఎంచుకోవాలని, ముఖ్యంగా ఎయిర్ బ్యాగులు,సీట్ బెల్ట్ రిమైండర్లు వంటి భద్రతా లక్షణాలను పరిశీలించాలని సూచించారు.చిన్న దూరమైనా,పెద్ద దూరమైనా ప్రతి ప్రయాణంలో సీట్ బెల్ట్ ధరించడం అలవాటు చేసుకుంటే దాదాపు 90 శాతం ప్రమాదాలను నివారించవచ్చని, ఒకవేళ ప్రమాదం జరిగినా ప్రాణనష్టం లేకుండా కాపాడుకోవచ్చని తెలిపారు.రోడ్డు భద్రత పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని వాహనదారులను సీపీ కోరారు.ఈ కార్యక్రమంలో గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్, గోదావరిఖని వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, రామగుండం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వరరావు, గోదావరిఖని టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ ప్రసాదరావు,ఎస్ఐలు రమేష్,అనూష, మనోహర్,ట్రాఫిక్ ఎస్ఐ హరీష్ శేఖర్, రామరాజు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.